క్లుప్తంగా

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ

చినగంజాం: భూమి లేని నిరుపేదలకు లంక భూములు కేటాయించేందుకు మంత్రివర్గ సమావేశంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయం అని బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు పేర్కొన్నారు. మండలంలోని చింతగుంపల గ్రామంలో గురువారం రాత్రి ఆయన ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కులవృత్తులు చేసుకునే వారికి ఇచ్చిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు సీఎం, కేబినెట్ విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారని, దీంతో 1.13 లక్షల మంది బీసీలకు ప్రయోజనం కలగనుందన్నారు.

వ్యక్తి హల్‌చల్

అద్దంకి: భార్యను గాయపరచి, తెల్లవారిన తరువాత పురుగుమందు తాగానని ఓవ్యక్తి హడావుడి చేశాడు. ఈఘటన మండలంలోని శింగరకొండలో గురువారం జరిగింది. అందిన సమాచారం మేరకు శింగరకొండలో నివాసం ఉంటున్న యేటగిరి పోలయ్య బుధవారం రాత్రి భార్యను గాయపరిచాడు. ఈ క్రమంలో అతను గురువారం పురుగుల మందు తాగానని బంధువులతో చెప్పాడు. వారి సమాచారం మేరకు 108 సిబ్బంది అతనిని వైద్యశాలలో చేర్చారు. ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

వలంటీర్లకు వందనం

సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి దరఖాస్తు చేయించడం, ఆపద సమయాల్లో అండగా నిలవడం, ఒకటో తేదీ తెల్లవారుజామునే అవ్వాతాతల తలుపుతట్టి పింఛను డబ్బు చేతికందించి వారి ఆశీస్సులు పొందడం.. ఇదీ వలంటీర్ల పని. వాస్తవానికి వలంటీర్లు చేస్తున్నది పనికాదు సమాజసేవ. కేవలం రూ.5 వేల గౌరవ వేతనం తీసుకుంటున్న వలంటీర్లు కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ప్రజలకు అండగా నిలిచి మన్ననలు పొందారు.

ఒక అర్జీతో పింఛన్ మంజూరు..



గతంలో ఫించన్ మంజూరు కోసం నాలుగైదుసార్లు దరఖాస్తు చేశా. కానీ మంజూరు చేయలేదు. జన్మభూమి కమిటీ ఆమోదం కావాలి.. ఆ పత్రం కావాలి...అంటూ కాలయాపన చేశారు. కానీ సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ఫించన్‌కోసం ఒక్కసారే దరఖాస్తు అందించా.. వెంటనే మంజూరు చేశారు. ప్రతీ నెల 1వ తేదీ ఉదయాన్నే పింఛన్ డబ్బులు అందిస్తున్నారు. వలంటీర్ వల్ల నాలాంటి వారికి చాలా మేలు చేకూరింది.

ఆర్ నాగేశ్వరరావు, పాపరాజుతోట

ఎల్లలు దాటిన సేవలు

- కరోనా విపత్కర సమయాల్లో అన్నీ తామైన వలంటీర్లు
- రాష్ట్రాలు దాటి వెళ్లి పింఛన్లు పంపిణీ

చీరాల: ప్రభుత్వం వారికి ఇచ్చేది గౌరవ వేతనం మాత్రమే. కానీ వారికి ప్రజలు, ప్రభుత్వం సొంత గడ్డపై ఉన్న మమకారంతో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కష్టపడిన ఘటనలు అనేకం. సొంత ఖర్చులతో రాష్ట్రాలు దాటి పింఛన్లు, వైఎస్సార్ బీమా రెన్యూవల్స్ చేయించిన సేవా దృక్పథం వారిది. కానీ రాజకీయాలకు సంబంధం లేకుండా ప్రతి ఇంటి గుమ్మం తొక్కుతూ పండుటాకులు, దివ్యాంగులకు, వితంతువులకు మేమున్నామంటూ ఆప్యాయంగా పలకరించే ఆ పలకరింపులను లేకుండా చేయాలని దుష్టచతుష్టయం రంగంలోకి దిగింది. వలంటీర్ల వ్యవస్థను అవమానకర రీతిలో సభ్య సమాజం తలదించుకునే విధంగా ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ప్రతీ నెల ఒకటో తేదీన తెల్లవారుజాము నుంచే పింఛన్లు ఇంటి ముంగిటకే అందిస్తూ ఆ కుటుంబంలో సభ్యుడిగా ఉంటూ ప్రభుత్వ పథకాలు అందిస్తున్న వలంటీర్లను కించపరిచేలా పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేయడంతో వలంటీర్లు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారు. కేవలం తక్కువ వేతనంతో ప్రజలకు సేవలందిస్తున్నా వలంటీర్లు సేవలకు సలాం చెప్పాల్సింది పోయి.. అమ్మాయిలను అక్రమ రవాణా చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారంటూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు వారి మనోభావాలను అడుగడుగునా దెబ్బతీస్తున్నాయి. 50 ఇళ్లలో కుటుంబాలకు ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా... పథకాలు అందించాలన్నా వలంటీర్లే కీలకపాత్ర పోషిస్తున్నారు. పింఛన్లు పంపిణీకి రాష్ట్రాలు దాటి వెళ్లి ఫించన్లు అవ్వా, తాతలకు అందిస్తూ మన వళ్లుగా నిలిచారు వలంటీర్లు.

తిరుపతి వెళ్లి.. పింఛన్ అందించి..

బోసనగర్‌కు చెందిన గుంటి రామచంద్రరావు క్యాన్సర్ వ్యాధితో తిరుపతిలోని వెంకటేశ్వర మెడికల్ సైన్సెస్ హాస్పిటల్‌లో చికిత్స పొందాడు. మూడు నెలలుగా ఫించన్ తీసుకోలేదు. దీంతో వలంటీర్ షేక్.నాగూర్‌బాబు తిరుపతికి చేరుకుని పింఛన్ దారుడు చికిత్స పొందుతున్న హాస్పిటల్‌కు వెళ్లి మూడు నెలల ఫించన్‌ను ఒకేసారి చెల్లింపు చేశారు. అంతేకాకుండా వైఎస్సార్ బీమా నమోదును కూడా పూర్తి చేశాడు. వలంటీర్లు జిల్లాలు, రాష్ట్రాలు దాటి ఫించన్లు అందించడంపై అందరూ హర్షం వ్యక్తం చేయడంతో పాటుగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



హాస్పిటల్‌లో రామచంద్రరావుకి పింఛన్ అందిస్తున్న వలంటీర్ నాగూర్‌బాబు (ఫైల్)

ఈబీసీ నేస్తం పథకాన్ని అందించారు..



గతపాలకులు పేద ప్రజల సంక్షేమాన్ని మరిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలతో పాటుగా వెనుకబడిన ఈబీసీలకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థికవృద్ధి చేకూరేలా ఈబీసీ నేస్తం పథకాన్ని అందించారు. వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు, వివిధ ధ్రువీకరణ పత్రాలు అందిస్తూ అందరిలో తలలో నాలుకలా ఉంటున్నారు. కొందరు తమ దిగజారుడు రాజకీయాల కోసం వలంటీర్లను దుర్భాషలాడటం దుర్మార్గం.

డీ.పద్మజ, చీరాల

జగనన్న సురక్షతో సమస్యలకు పరిష్కారం



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- ఏపీ శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

అద్దంకి రూరల్/మేదరమెట్ల: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలన్నింటికీ సత్వర పరిష్కారం లభిస్తుందని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని నాగులపాడు, చక్రాయపాలెం గ్రామాల్లోని సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణచైతన్య మాట్లాడుతూ సాంకేతిక లోపాలతో సంక్షేమ పథకాలకు అర్హులు కాని వారు జగనన్న సురక్షలో సరైన సర్టిఫికెట్లు పొంది అర్హులు కావాలన్నారు. ఎన్నికల ముందు ఇటువంటి కార్యక్రమాన్ని ప్రారంభించడం జగనన్నకు ప్రజల్లో ఆదరణకు నిదర్శనమన్నారు. అనంతరం అర్జీదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, సర్పంచ్‌లు, ఎంపీడీవో, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొరిశపాడు మండలంలోని పమిడిపాడు, రాచపూడి గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో శాప్‌నెట్ చైర్మన్ పాల్గొని పమిడిపాడులో 1058, రాచపూడిలో 792 మొత్తం 1850 మందికి పలు రకాల పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, ఎండీవో సురేష్‌బాబు, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, ప్రత్యేకాధికారి సురేంద్రబాబు, నాయకులు, పార్టీ శ్రేణులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న వెంకటేష్

- సర్టిఫికెట్లు పంపిణీ చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని చీరాల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం చీరాల రూరల్ మండలం గవినివారిపాలెం–1,2 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. గవినివారిపాలెం -1, సచివాలయ పరిధిలో 3330 మందికి సర్టిఫికెట్లు మంజూరు కావడం జిల్లా స్థాయిలో మొదటి స్థానం, రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచిందన్నారు. గ్రామంలో రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గవినివారిపాలెం–2 సచివాలయ పరిధిలో 2050 మందికి సర్టిఫికెట్లు మంజూరు చేశామన్నారు. ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యే వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడానికి మరలా సీఎంగా జగనన్నను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.సరోజిని, స్పెషలాఫీసర్ చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీవో నేతాజీ, తహశీల్దార్ జి.ప్రభాకర్, అగ్రికల్చర్ ఆఫీసర్ సత్తార్, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, ఏపీఎం సుబ్బారావు, బుర్ల సాంబశివరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, గవిని సాంబయ్య, గవిని ప్రసాద్, గవిని మేకల వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, జీసీఎస్ మండల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీల్లో ప్రభుత్వ విద్యార్థుల హవా



డీ.సౌమ్య సుప్రజ యశస్విని పూజిత రమ్యశ్రీ పూజ శ్రీ పల్లవి తబస్సుమ్ లీలా ప్రసాద్ మహేశ్వరి



హేమంత్ రెడ్డి గీతాంజలి

జే.పంగులూరు/మేదరమెట్ల/బల్లికురవ: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించడంతో పాటు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు. గురువారం విడుదలైన ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు సత్తా చాటాయి. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బల్లికురవ ఉన్నత పాఠశాలలో నిమ్మల భార్గవి, గుమ్మడి జెస్సికా నూజివీడు ట్రిపుల్ ఐటీలో, కొనిదెన విద్యార్థిని కొణిదెన అయ్యప్ప ఒంగోలులో ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మిఠాయిలు పంచిపెట్టారు. హెచ్‌ఎం కె. హనుమంతరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, పీఎంసీ చైర్మన్‌లు నార్నే శ్రీనివాసులు తన్నీరు రామాంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు.

పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వడ్లమూడి నాగస్వామి, షేక్ నసీమాకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో, తెల్ల వెంకసాయి తరుణ్ తేజకు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినట్లు హెచ్‌ఎం కొప్పోలు రమాదేవి తెలిపారు. చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 10 విద్యార్థుల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీకి తొమ్మిది మంది, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో విద్యార్థికి సీట్లు సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. రామకూరు నుంచి ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు.

కొరిశపాడు మండలం పమిడిపాడు జెడ్పీహెచ్‌కు చెందిన డీ.సౌమ్య, దైవాలరావూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ఐ.సకీనా మేదరమెట్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని కే.పూజితశ్రీ నూజివీడులో సీట్లు సాధించారు. రావినూతల జెడ్పీహెచ్ విద్యార్థిని విజయలక్ష్మీ ఇడుపలపాయలో, దివ్యతేజశ్రీలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందారు.



బల్లికురవలో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న హెచ్ఎం, తల్లిదండ్రులు

- అభినందనలతో ముంచెత్తిన ఉపాధ్యాయులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

ప్రభుత్వ విద్యార్థుల హవా..

వేటపాలెం: మండల పరిధిలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం భట్టిప్రోలు వెంకటేశ్వరరావు తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలకు దంతం విష్ణుప్రియ, పేరిశెట్ల పల్లవి, పృథ్వీ కార్తీక్ సాయి మోహన్, గుత్తి లీలా వెంకట శ్రావణ్ పోలకం దేవీప్రియ ఎంపికయ్యారు. ఒంగోలు కళాశాలకు ఉట్ల కుసుమ, పృథ్వీ శ్రీలక్ష్మీ సృజన, చల్లా అమృత వర్షిణి, వాలి షాలినీ, మాచర్ల భవాని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్ డీ భవాని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో, ఆర్ జ్యోత్స్న ఒంగోలుకు ఎంపికయ్యారు.

ట్రిపుల్ ఐటీలో మార్టూరు విద్యార్థుల సత్తా..

మార్టూరు: ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో మొదటి విడత మార్టూరు మండలంలో మూడు పాఠశాలలోని 16 మంది ఎంపికై తమ ప్రతిభ చాటారు. వలపర్ల పాఠశాల నుంచి పీ సుప్రజ, ఎం యశస్విని, ఎం పూజిత, ఎం పూజశ్రీ, ఎం రమ్యశ్రీ, పీ పల్లవి, యూ మహేశ్వరి, జీ జశ్వంత్, జీ సాయిలోకేష్ మొత్తం తొమ్మిది మంది నూజివీడు ట్రిపుల్ ఐటీలో, పీ శ్రీనాథ్, యూ లీలానందినిలు ఒంగోలు, ఎం పవిత్ర ఇడుపులపాయ కళాశాలలో సీట్లు పొందారు. ఇసుక దర్శి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బండ్ల లీలా ప్రసాద్ ఒంగోలు, షేక్ అయేషా తబస్సుమ్ నూజివీడు కళాశాలల్లో సీట్లు పొందారు. మార్టూరు రాయల్ హైస్కూల్‌కు చెందిన డీ అశ్విని, కే యోక్షిత ఇరువురు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీట్లు పొందినట్లు డైరక్టర్ పేరా రవీంద్రబాబు తెలిపారు. విద్యార్థులను వలపర్ల హెచ్‌ఎం ఎం నిర్మల, ఇసుక దర్శి హెచ్‌ఎం శైలజా లక్ష్మి, రాయల్ హైస్కూల్ ఇన్‌చార్జ్ కే మధుబాబు, హెచ్‌ఎం డీవీ బాలసుబ్రమణ్యం ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు మండలం ఏల్చూరు జెడ్పీహెచ్ స్కూల్‌లో చదివిన సీహెచ్ నవ్యలక్ష్మి, చవిటి పాలెంలో జెడ్పీ హెచ్ స్కూల్‌కు చెందిన బుల్లా సునీత, మక్కెనవారిపాలెం జెడ్పీహెచ్ స్కూలో చదివిన నవ్యశ్రీ, పూజిత, నసీరున్‌లు ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించారని ఉపాధ్యాయులు తెలిపారు.

చినగంజాం: చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం డీ రత్నకుమారి తెలిపారు. వీరిలో బక్కా హేమంత రెడ్డి, బెంగుళూరు గీతాంజలిలు ఉన్నట్లు, వీరికి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీట్లు కేటాయించినట్లు ఆమె తెలిపారు. వీరికి పాఠశాల సిబ్బంది, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి అభినందనలు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చినగంజాం: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపాలెం పంచాయతీ రామచంద్రనగర్‌లో జరిగింది. బాధితురాలి వివరాల మేరకు.. రామచంద్రనగర్ గ్రామానికి చెందిన వల్లెపు సుబ్బులు గేదె బుధవారం సాయంత్రం ఉప్పుకొఠారు భూముల సమీపంలో పచ్చిగడ్డి మేసేందు వెళ్లింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో పచ్చిగడ్డి ఉండటంతో అక్కడకు వెళ్లి మేత మేస్తున్న సమయంలో విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. ఘటనా స్థలాన్ని విద్యుత్‌శాఖ ఏడీ జే శ్రీనివాసరావు, ఏఈ గణ నారాయణలు గురువారం సందర్శించి పరిశీలించారు. ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పాలకావిళ్లు



పాల కావిళ్ల ఊరేగింపులో మహిళలు

కారంచేడు: మండల కేంద్రంకారంచేడు మాస్కోజబారు సమీపంలోని చెరువుకట్ట మీద కొలువైన సుబ్రమణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున్న పాల కావిళ్లతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

1515 సర్టిఫికెట్లు పంపిణీ

యద్దనపూడి: జగనన్న సురక్ష పథకంలో భాగంగా జాగర్లమూడి గ్రామ సచివాలయంలో ఎమ్మార్వో వెంకటరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ మోహన్‌రావు ఆధ్వర్యంలో 715 మందికి, పోలూరు గ్రామ సచివాలయం పరిధిలో ఎంపీడీవో కృష్ణకుమారి, స్పెషల్ ఆఫీసర్ సాంబశివరావు ఆధ్వర్యంలో 800 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి అమ్మిరెడ్డి, డిటీ మస్తాన్‌రావు, సర్పంచ్ ఎమ్మెలమ్మ, కార్యదర్శులు అశోక్‌బాబు, శరత్, వీఆర్వోలు పాల్గొన్నారు.

జనసేన నాయకుల కవ్వింపు చర్యలు



వాగ్వివాదం చేస్తున్న జనసేన నాయకులు

చీరాల: జనసేన కార్యకర్తలు ఓవర్ యాక్షన్ చీరాలలో ఉద్రిక్తతకు దారితీసింది. వలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా చీరాల గడియార స్తంభం సెంటర్‌లో బుధవారం మానవహారం నిర్వహించి పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే ఇందుకు వ్యతిరేకంగా ఘర్షణ వాతావారణాన్ని సృష్టించేందుకు జనసేన కార్యకర్తలు ప్రయత్నించారు. గడియార స్తంభం సెంటర్‌లో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేసేందుకు ప్రయత్నించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదే సమయంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అక్కడకు వచ్చి కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. దీంతో ఇరువురికి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనసేన నాయకులు, పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ నాయకులు నినాదాలు చేశారు. దీంతో ఒన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల అక్కడి నుంచి పంపించి వేయడంతో వివాదం సద్దుమణిగింది.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

చీరాల అర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదపడతాయని ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత హెచ్‌ఎం బి.సాల్మన్‌రాజు పేర్కొన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో పూలు, కూరగాయల మొక్కలను నాటారు. విద్యార్థులందరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటి పరిరక్షించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు పడే సమయంలో మొక్కలు నాటితే ఎంతో త్వరగా ఎదుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల వితరణ

వేటపాలెం: పోలీస్ స్టేషన్‌కి రూ. 50 వేల విలువ చేసే ఐదు సీసీ కెమెరాలు ఉప సర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు బహూకరించినట్లు చీరాల డీఎస్పీ కే ప్రసాదరరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రామన్నపేట పంచాయతీ ఉపసర్పంచ్ ఆ గ్రామ సచివాలయ మహిళా పోలీస్ బండారు అంబిక ప్రోత్సాహంతో నేర పరిశోధనలో ఉపయోగ పడేందుకు వీలుగా ఐదు సీసీ కెమెరాలను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతను, మహిళ పోలీస్‌ను అభినందించారు. రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్సై జీ సురేష్ పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన నారు అందించాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

యద్దనపూడి: నర్సరీల ద్వారా రైతులకు నాణ్యమైన నారు అందించాలని పర్చూరు హార్టికల్చర్ అధికారి డి. రవి ప్రకాష్‌బాబు నర్సరీ యజమానులకు సూచించారు. గురువారం మండలంలోని గన్నవరం, మార్టూరు దండుదారి మధ్య, ఇంకొల్లు మండలం నాగండ్లలో గల నర్సరీలను ఆయన పరిశీలించారు. నర్సరీ యజమానులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని, నారు రిజిష్టర్ చేసుకున్న రైతులకు తప్పనిసరిగా నారుతో పాటు రసీదు కూడా ఇవ్వాలన్నారు. అలాగే రసీదులో ఏ రకం నారు కొనుగోలు చేశారో దాని లాట్‌నెంబర్, విత్తన రకం వంటివి తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఎవరైనా నాసిరకం నారు ఇవ్వటం బిల్లులు లేకుండా నారు విక్రయిస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పర్చూరు (చినగంజాం): పర్చూరులో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరిగి 41 రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని పూజా కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు హనుమాన్ చాలీసా పఠించడంతో పాటు స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలి రావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కోట హరిప్రసాద్, కఠారి సురేంద్ర, గడ్డిపాటి శ్రీనివాసరావు, రంగిశెట్టి ఆంజనేయులు, గాజుల రమేష్, శివ నాగేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గేదెల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు



గేదెలకు స్టిక్కర్‌లు అంటిస్తున్న ఎస్సై

పర్చూరు (చినగంజాం): ఇటీవల రాత్రి వేళ రోడ్డుపై గేదెలు అడ్డురావడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న నేపథ్యంలో పోలీసులు గేదెల కొమ్ములకు రేడియం స్టిక్కర్లను అంటించారు. పర్చూరు ఎస్సై ఎస్ చెంచు ప్రసాద్ గురువారం రాత్రి మండలంలోని ఉప్పుటూరు గ్రామస్తులకు అవగాహన కల్పించి గేదెల కొమ్ములకు రేడియం స్టిక్కర్‌లను అంటించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళ రోడ్డు మీద గేదెలు అడ్డు రావడం వలన గేదెలు చనిపోవడం, అవి తగిలి ప్రజలు చనిపోతున్నారని చెప్పారు. గేదెలు రోడ్డు మీద తిరగడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున స్టిక్కర్‌లను అంటిస్తున్నట్లు తెలిపారు. రాత్రి వేళ గేదెలను రోడ్లపై వదలొద్దని ఆయన గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఉప్పుటూరు రైతులు, పర్చూరు పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వమతాల సారాంశం ఒక్కటే



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: అన్ని మతాల సారాంశం ఒక్కటేనని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. గురువారం కొప్పరపాడు గ్రామ సమీపంలోని ఒలివల కొండ సమీపంలో ఏర్పాటు చేసిన జీప్సీ ప్రార్థనా మందిర వార్షికోత్సవంలో పాల్గొని మాటాడారు. ప్రజలంతా శాంతి మార్గంలో నడుస్తూ అహింసను విడనాడాలన్నారు. పాస్టర్ మంత్రూనాయక్ ప్రత్యేక ప్రార్థనలతో చైతన్యను ఆశీర్వదించారు. వేడుకల్లో జిల్లా రైతు అధ్యక్షుడు, మండల కన్వీనర్ చింతల పేరయ్య, స్థానిక నేతలు బండారు గురవయ్య, యర్రా మునలయ్య, దానా నాయక్, మోహన్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

15,16 తేదీల్లో సీఐటీయూ జిల్లా వర్క్‌షాప్

చీరాల అర్బన్: సీఐటియూ జిల్లా వర్క్‌షాప్ 2023 ఈనెల 15,16 తేదీల్లో చీరాల మండలం వాడరేవులో నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం వాడరేవులో కరపత్రాన్ని ఆవిష్కరించారు. కొత్తగా జిల్లా ఏర్పడిన తర్వాత చీరాల మండలం జిల్లాలో కార్మిక ఉద్యమాన్ని ప్రతి మండలంలో బలోపేతం చేయడానికి జిల్లాస్థాయి నాయకత్వానికి శిక్షణ ఇవ్వడానికి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీరాల మండల కార్యదర్శి ఎం.వసంతరావు, నాయకులు ప్రమీల లక్ష్మి, సుజాత, చిట్టెమ్మ, మాధవి పాల్గొన్నారు.